ముగిసిన ముత్యాలమ్మ తల్లి ఉత్సవాలు

శ్రీకాకుళం నగరానికి గ్రామదేవతగా కాకివీధిలో వెలసిన ముత్యాలమ్మ తల్లి ఉత్సవాలు మంగళవారం ఘటాల ఊరేగింపుతో ముగిశాయి. తొమ్మిది రోజుల పాటు అమ్మవారికి పసుపు, కుంకుమ , ముర్రాట్లతో చల్లదనం, నైవేద్యాలతో పూజలు నిర్వహించారు. చివరి రోజు అమ్మవారి ఘటాలను ఆలయం వద్ద నుంచి పురవీధుల్లో ఊరేగింపుగా తీసుకెళ్లారు. ప్రతి ఇంటినుంచి వచ్చిన ఘటాలను అమ్మవారి ఆలయానికి చేర్చారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి.

– శ్రీకాకుళం కల్చరల్


ముత్యాలమ్మతల్లి ఘటాల ఊరేగింపు


ఊరేగింపులో కాళికామాత వేషధారణ


బుట్ట దీపంతో మహిళ


ఘటాలతో మహిళలు


ఇళ్ల వద్దనుంచి బయలు దేరిన ఘటాలు


తప్పెటగుళ్ల కళాకారులు

క్లుప్తంగా

విజయగణపతికి విశేష పూజలు


ప్రత్యేక అలంకరణలో విజయగణపతి

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని పాలకొండ రోడ్డులో విజయగణపతి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు పెంట శ్రీధర్‌శర్మ, సూర్యనగేష్ శర్మల ఆధ్వర్యంలో స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.

ఘనంగా గ్రామ దేవత ఉత్సవాలు


ప్రత్యేక అలంకరణలో పోలమాంబ అమ్మవారు

ఎచ్చెర్ల క్యాంపస్: కుశాలపురం గ్రామంలో గల పోలమాంబ అమ్మవారి గ్రామ దేవత ఉత్సవాలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి ముర్రాటలు చెల్లించి భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. బంధువులతో గ్రామంలో సందడి నెలకొంది. ఉత్సవాలు బుధవారంతో ముగియనున్నాయి.

దవళపేట విద్యార్థి ప్రతిభ


వంశీ

జి.సిగడాం: మండలంలోని దవళపేట ఎంపీపీ పాఠశాలలో 4వ తరగతి చదువుతున్న కేత వంశీ ఇటీవల ప్రభుత్వం నిర్వహించిన గురుకుల విద్యాలయాల్లో ప్రవేశ పరీక్షలలో సత్తాచాటాడు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులం, ఏపీ ఎస్ ఎంపురం గురుకులం, మహాత్మా జ్యోతీరావు పూలే విద్యాలయాల్లో నిర్వహించిన ప్రవేశ పరీక్షలలో మంచి ప్రతిభ కనబర్చాడని పాఠశాల హెచ్‌ఎం ఎం.దేశన్న, ఉపాధ్యాయిరాలు షేక్ రహీమున్నిషా మంగళవారం తెలిపారు.

అన్నదాన పథకానికి విరాళం


విరాళం అందిస్తున్న రామారావు

శ్రీకాకుళం కల్చరల్: రిమ్స్ అన్నపూర్ణ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి పట్టణానికి చెందిన లోకనాథం రామారావు తన కుమారుడు ఎల్.సందీప్ పుట్టిన రోజు సందర్భంగా రూ.10వేలు విరాళంగా మంగళవారం అందచేశారు. కార్యక్రమంలో అన్నపూర్ణ పథకం అధ్యక్షుడు గంగుల రమణబాబు, జిల్లా అధ్యక్షుడు సూర రామచంద్రరావు, సంఘం కార్యదర్శి కిల్లాన ఫల్గుణరావు, పప్పల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం


మాట్లాడుతున్న ఈశ్వరమ్మ

ఎచ్చెర్ల క్యాంపస్: పాఠశాల స్థాయిలో విద్యార్థులు క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వాలని పీఈటీ ఈశ్వరమ్మ అన్నారు. ధర్మవరం గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరాన్ని మంగళవారం పరిశీలించారు. విద్యలో రాణించాలంటే ఆరోగ్యంగా ఉండాలన్నారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సైతం ఆటలు ఆడేందుకు ప్రోత్సహించాలని సూచించారు. గ్రంథాలయ అధికారి చంద్రశేఖరరావు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సాయం



వజ్రపుకొత్తూరు రూరల్: మండలంలోని అనకాపల్లి గ్రామానికి చెందిన ఎలుగు బాధితురాలు చిడిపల్లి సావిత్రికి పూర్వ విద్యార్థులు(1995–96 బ్యాచ్) మంగళవారం రూ.12 వేలు ఆర్థిక సాయం చేసి అండగా నిలిచారు. ఎలుగుబంటి దాడిలో సావిత్రి గాయపడటంతో పాటు ఆమె భర్త లోకనాథం మృతి చెందారు. విషయం తెలుసుకున్న స్నేహితులు బాధితురాలను పరామర్శిస్తూ మనోధైర్యాన్ని నింపారు. సావిత్రి కుటుంబానికి అండగా ఉంటామని భరోసా కల్పించారు.

అధ్యాపకుడి ఔదార్యం

కాశీబుగ్గ: మందస మండలం బహడాపల్లి గ్రామానికి చెందిన సానిల పున్నెమ్మ రెండు కిడ్నీలు పాడై తీవ్రమైన అనారోగ్యానికి గురైంది. డయాలసిస్ అవసరం కావడంతో పలాస కిడ్నీ ఆసుపత్రికి తీసుకువచ్చారు. సరిపడ రక్తం లేక ఇబ్బందిపడుతున్న సమయంలో మందస మండలం బాలిగాం గ్రామానికి చెందిన ప్రైవేటు కళాశాల అధ్యాపకుడు గున్న వెంకటరావు స్పందించారు. సరిపడా ఓ–పాజిటివ్ రక్తాన్ని అందించి ఆదుకున్నారు.

ఎరువుల తయారీపై అవగాహన


రీసోర్స్‌పర్సన్లతో విద్యార్థులు

ఎచ్చెర్ల క్యాంపస్: ఎరువుల తయారీ, వినియోగంపై అగ్రికల్చర్ బీఎస్సీ చదువుతున్న విద్యార్థులకు అవగాహన ఉండాలని సంతసీతారంపురంలోని సెంచూరియన్ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ కె.మోష అన్నారు. సెంచూరియన్ వ్యవసాయ కళాశాలలో మంగళవారం ఫెర్టిలైజర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (సౌత్రన్ రీజన్) ఆధ్వర్యంలో ఎరువుల తయారీ, వినియోగంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కోరమండల్ ఎరువుల తయారీ సంసంస్థతో పాటు, మరో 13 ఎరువుల తయారీ కంపెనీల ప్రతినిధులు హాజరై ఎరువుల తయారీ ప్రమాణాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మోష మాట్లాడుతూ వ్యవసాయ సాగులో ఎరువులు కీలకమన్నారు. నాణ్యమైన ఎరువులు, పురుగుల మందులు రైతులకు చేరాలన్నారు. ఎరువుల వినియోగంలో సాంకేతికత పెరుగుతుందన్నారు. డ్రోన్ టెక్నాలజీ పురుగుల మందుల పిచికారీలో కీలకమన్నారు. ఈ కార్యక్రమంలో ఎరువుల పరిశ్రమల ప్రతినిధులు, మార్కెటింగ్ మేనేజర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు పాల్గొన్నారు.

ఇస్రో విశిష్టతను తెలుసుకోవాలి


మాట్లాడుతున్న రీసోర్స్‌పర్సన్ సూర్య ప్రకాశ్

ఎచ్చెర్ల: ప్రతీ విద్యార్థి ఇస్రో గొప్పతనం గురించి తెలుసుకోవాలని రీసోర్స్‌పర్సన్ అరవెల్లి సూర్య ప్రకాశ్ తెలిపారు. లావేరు శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా భారతీయ అంతరిక్ష పరిశోధనా సంస్థ, ఇస్రో శ్రీహరికోటలో ప్రయోగాలు గురించి మంగళవారం వివరించారు. బెంగుళూరు కేంద్రంగా ఏర్పాటైన ఇస్రో దేశంలో వివిధ ప్రదేశాల్లో పరిశోధన అభివృద్ధి సౌకర్యాలు కలిగి ఉందన్నారు. 1957 రష్యా మొట్ట మొదటి శాటిలైట్ స్పుత్నిక్‌ను ప్రయోగించారన్నారు. 1980లో శ్రీహరి కోట నుంచి రోహిణి ఉపగ్రహాన్ని అతరిక్షంలో విజయవంతంగా ప్రవేశపెట్టారన్నారు. ఉపగ్రహాల ప్రయోగానికి అత్యంత అనువైన ప్రదేశం శ్రీహరి కోట నెల్లూరు జిల్లాలో సూళ్లురుపేట దగ్గర ఉందని, ఈ అంతరిక్ష కేంద్రం పేరు సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రమన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి మురపాక శ్రీనివాసరావు, సహాయకులు వీరభద్రుడు, విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

ఆకలికేకలు లేని సమాజమే లక్ష్యం


భోజన ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న లయన్స్‌క్లబ్ ప్రతినిధులు

శ్రీకాకుళం అర్బన్: ఆకలి కేకలు లేని సమాజమే ధ్యేయంగా ముందుకు సాగాలని లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ అధ్యక్షులు పొన్నాడ రవి కుమార్ అన్నారు. ప్రపంచ ఆకలి నివారణ దినోత్సవం సందర్భంగా మొండేటి వీధిలోని లెప్రసీ కాలనీలో 80 కుటుంబాలకు భోజన ప్యాకెట్లు, పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆకలితో అలమటిస్తున్న వారికి తోచిన విధంగా సహకరించాలని కోరారు. కొన్ని స్వచ్ఛంద సేవా సంస్థలు నిత్యం అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తుండటం గొప్ప విషయమన్నారు. వేడుకల్లో మిగిలిన ఆహారాన్ని వృథా చేయకుండా లయన్స్ క్లబ్ సభ్యులు ఉర్లాం శివతేజాను సంప్రదిస్తే పది మంది ఆకలి తీర్చటంలో సహాయపడతారన్నారు. కార్యక్రమంలో క్లబ్ మెంటార్ నటుకుల మోహన్, సెక్రటరీ టెక్కం రామ్‌గోపాల్, కోశాధికారి శిల్లా మణికంఠ, సభ్యులు ఈశ్వరరావు, లావేటి లక్ష్మణరావు, లెప్రసీ కాలనీ ప్రెసిడెంట్ పాపారావు పాల్గొన్నారు.

పరామర్శ..


కోటిబాబును పరామర్శిస్తున్న సాయికుమార్

జి.సిగడాం: మండలంలోని మర్రివలస గ్రామ సర్పంచ్ విక్రం కోటిబాబు అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి పిన్నింటి సాయికుమార్, పున్నాన అక్కలనాయుడు మంగళవారం మర్రివలస గ్రామానికి వెళ్లి కోటిబాబును పరామర్శించారు. వేగంగా కోలుకోవాలని ఆకాంక్షించారు. పరామర్శించిన వారిలో పార్టీ కార్యకర్తలు అలుగోలు శ్రీనివాస్, రమణ, లక్ష్మణరావు ఉన్నారు.


రణస్థలం: రమణను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

రణస్థలం: మండలంలోని రావాడ గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు లంక రమణ అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ మంగళవారం రమణ ఇంటికి వెళ్లి పరామర్శించారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. పరామర్శించిన వారిలో రావాడ పంచాయతీ నాయకులు ఉన్నారు.

కేంద్రం నిర్ణయంతో మీటర్ రీడర్ల భవిష్యత్ ప్రశ్నార్థకం


మాట్లాడుతున్న చాపర వేణుగోపాలరావు

కాశీబుగ్గ: కేంద్రం తీసుకొచ్చిన విద్యుత్ సంస్కరణ చర్యల్లో భాగంగా స్మార్ట్ మీటర్లు రావడంతో మీటర్ రీడర్ల ఉపాధి ప్రశ్నార్థకంగా మారిందని ఏఐటీయూసీ పలాస డివిజన్ సంఘం అధ్యక్షుడు చాపర వేణుగోపాల్ అన్నారు. కాశీబుగ్గ ఏఐటీయూసీ భవనం ఆవరణలో మంగళవారం మీటర్ రీడర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మీటర్ రీడర్లకు ప్రత్యామ్నాయం కల్పించి తక్షణమే ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం, విద్యుత్‌శాఖ యాజమాన్యం అంగీకరించిన మూడు అంశాలను అమలు చేయాలని కోరారు. పీస్ రేటును పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో విశాఖ జిల్లా అధ్యక్షుడు క్రాంతి కుమార్, జిల్లా కమిటీ అధ్యక్షుడు ఆర్.కుమార్‌స్వామి, పలాస డివిజన్ అధ్యక్షుడు బి.ఓంకార్‌రావు, పలాస డివిజన్ ప్రధాన కార్యదర్శి డి.భాస్కరరావు, ప్రతినిధులు జి.ఆనందరావు, కె.నరేష్, ఎస్.బలరాం, డి.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పాఠ్యపుస్తకాలు వచ్చేశాయ్..


పుస్తకాలను పరిశీలిస్తున్న ఎంఈఓ–2 లావణ్య

రణస్థలం: మండల కేంద్రంలోని ఎంఈఓ కార్యాలయానికి 2024–25 సంవత్సరానికి సంబంధించిన ఒకటి నుంచి పదో తరగతి వరకు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అవసరమైన పాఠ్యపుస్తకాలు చేరుకున్నాయని ఎంఈఓ–2 బి.లావణ్య మంగళవారం తెలిపారు. నోటు పుస్తకాలు, పాఠ్యపుస్తకాలను పరిశీలించారు. మండలంలోని 108 పాఠశాలల్లోని 8150 మంది విద్యార్థులకు 54 వేల పుస్తకాలు వచ్చాయన్నారు. సీఆర్పీలు రామకృష్ణ, పాపినాయుడు, కంప్యూటర్ అసిస్టెంట్ విజయ్ ఉన్నారు.

పుస్తక పఠనంతో విజ్ఞానం


మాట్లాడుతున్న లైబ్రేరియన్ ఉగ్రసేన

శ్రీకాకుళం అర్బన్: సాంకేతిక పరిజ్ఞానం ఎంత పెరిగినా పుస్తక, పత్రికా పఠనంతో విజ్ఞానం పెరుగుతుందని బలగ గ్రంథాలయ అధికారి పి.ఉగ్రసేన అన్నారు. బలగ హడ్కో కాలనీలోని శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణా తరగతుల్లో భాగంగా మంగళవారం పిల్లల చేత ప్రముఖుల జీవిత చరిత్రపై ఉపన్యాసాలు చెప్పించారు. కార్యక్రమంలో గ్రంథాలయ సహాయకురాలు కె.అనిత, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రత్యేకావసరాల పిల్లల గుర్తింపు


ప్రత్యేకావసరాల పిల్లలను గుర్తిస్తున్న ఎంఈఓ మురళీకృష్ణ

ఎచ్చెర్ల: లావేరు మండలంలో 3 నుంచి 18 సంవత్సరాల లోపు గల ప్రత్యేకావసరాల పిల్లలను గుర్తించడం జరుగుతుందని ఎంఈఓ మజ్జి మురళీకృష్ణ తెలిపారు. మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం సర్వే చేపట్టారు. ఎంఈఓ మాట్లాడుతూ ఈ కార్యక్రమం మే ఒకటో తేదీ నుంచి నిర్వహిస్తున్నామన్నారు. ఇప్పటివరకు 18 మంది పిల్లలను గుర్తించడం జరిగిందన్నారు. ఐఈఆర్టీలు జి.మాధురి, ఎం.భోజరాజు, ఎంఎస్‌వో కో–ఆర్డినేటర్ జి.చంద్రశేఖర్, సీఆర్ఎంటీలు పాల్గొన్నారు.

వాసుదేవుడికి అభిషేకం


వాసుదేవుడి నిజరూప దర్శనం

కాశీబుగ్గ : కోరిన కోర్కెలు తీర్చే వాసుదేవ పెరుమాళ్ స్వామికి మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారి జన్మనక్షత్రమైన మూలా నక్షత్రం సందర్భంగా మాస తిరునక్షత్ర అభిషేకాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ప్రధాన అర్చకులు గోపినంబాళ్ల దాసుకూర్మాచార్యులు ఆధ్వర్యంలో అర్చకులు సచ్చిదానందపాడి, అనిల్ పాడీలు వాసుదేవుడిని నిజరూపధారుని గావించి అభిషేకం చేశారు. అనంతరం దివ్యాలంకృతుని చేసి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు.

వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి


వాండ్రంగిలో ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

జి.సిగడాం: కిశోర బాలికలు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని ఎచ్చెర్ల ఐసీడీఎస్ అధికారి డోల పాపి నాయుడు అన్నారు. మండలంలోని మెట్టవలస, పాలఖండ్యాం, వాండ్రంగి గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో మంగళవారం అవగాహన ర్యాలీలు నిర్వహించారు. కిశోర బాలికలు పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. బాల్య వివాహాల నిర్మూలన కోసం గ్రామస్థాయిలో పనిచేస్తున్న అంగన్‌వాడీ, ఏఎన్‌ఎంలు ప్రత్యేక నిఘా వేయాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో 18 ఏళ్ల వయస్సు నిండకుండా ఆడ పిల్లలకు వివాహాలు నిర్వహిస్తున్నారని, వీటిని అధిగమించేందుకు ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించాలన్నారు. ప్రాజెక్ట్ పరిధిలో గల జీసిగడాం, ఎచ్చెర్ల మండలాల్లో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాల పనితీరును మెరుగుపరిచేందుకు ప్రత్యేక అధికారులతో నిఘా ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు తమ్మినేని లక్ష్మి, కుప్పిలి ఉమామహేశ్వరి, అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

పక్కాగా ఘన వ్యర్థాల నిర్వహణ


మాట్లాడుతున్న డీఎల్‌ఎస్‌ఏ కార్యదర్శి సన్యాసినాయుడు

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఘన వ్యర్థ పదార్థాల పునర్వినియోగం సమర్థంగా చేపట్టాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసి నాయుడు అన్నారు. మంగళవారం బలగ హడ్కో కాలనీ పార్కులో మునిసిపల్ సిబ్బందితో న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తడి చెత్త, పొడి చెత్త, హానికరమైన చెత్తపై ప్రతి కుటుంబానికి అవగాహన కల్పించాలన్నారు. శ్రీకాకుళం నగరాన్ని కాలుష్య రహితంగా చేయాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. ఈ విషయమై మహిళా స్వయం శక్తి సంఘాలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ జి.వెంకటరావు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పి.కమలాకర్, అసిస్టెంట్ ఇంజినీర్ సంతోష్‌కుమార్, ఎం.శారద వాణి, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

నిస్వార్థ సేవలకు గుర్తింపు


శోభారాణి, ప్రసాద్, జగన్నాథనాయుడులను సత్కరిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం: సమాజంలో నిస్వార్థ సేవలకు ఎల్లప్పుడూ గుర్తింపు ఉంటుందని లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ చైర్మన్ కె.ఎస్.ఎస్.వి.ప్రసాద్ అన్నారు. శ్రీకాకుళం గాంధీనగర్‌లోని లయన్స్ క్లబ్ ఆఫ్ హర్షవల్లి కార్యాలయంలో స్టార్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో లయన్స్ ఇంటర్నేషనల్ జోనల్ ఆత్మీయ సన్మాన కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒకే ఏడాది రెండు పదవులు హర్షవల్లి క్లబ్‌కే వరించాయని, సభ్యుల సహకారంతోనే ఇది సాధ్యమైందన్నారు. క్లబ్ జోనల్ చైర్మన్‌గా శోభారాణిని నియమించినట్లు ప్రకటించారు. కార్యక్రమంలో క్లబ్ జిల్లా అధ్యక్షుడు వి.జగన్నాథంనాయుడు, మాజీ గవర్నర్ ఇందిరా ప్రసాద్, పి.గోవిందగుప్త, ఎస్.జోగినాయుడు, లక్ష్మి, రవిశంకర్, దేవిప్రసాద్, ప్రశాంత్, సభ్యులు పాల్గొన్నారు.

శిక్షణ సద్వినియోగం చేసుకోవాలి


కార్యక్రమంలో మాట్లాడుతున్న కుమార్‌రాజు

శ్రీకాకుళం అర్బన్: వేసవిలో ఆట, పాటలకు ప్రాధాన్యమిస్తూనే విరామ సమయంలో చక్కగా చదవడం, రాయడం నేర్చుకోవాలని జిల్లా గ్రంథాలయ కార్యదర్శి బుర్రి కుమార్‌రాజు అన్నారు. వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా మంగళవారం జిల్లా కేంద్ర గ్రంథాలయంలో విద్యార్థులకు సహజ సంఖ్యలు, కారణాంకాలు తదితర చాప్టర్లపై గణిత ఉపాధ్యాయుడు ఎం.జగదీశ్వరరావు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డిప్యూటీ గ్రంథ పాలకుడు వి.వి.జి.ఎస్.శంకరరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణే కీలకం


పోలీసు అధికారులతో మాట్లాడుతున్న ఆర్‌ఓ సుదర్శన్ దొర

ఇచ్ఛాపురం రూరల్: ఈ నెల 4న సార్వత్రిక ఎన్నికల ఫలితాలు వెలువడుతున్న సమయంలో గ్రామాల్లో ఎటువంటి అల్లర్లు జరుగకుండా ముందస్తు జాగ్రత్తగా చర్యలు చేపట్టాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి బి.సుదర్శన్‌దొర అన్నారు. మంగళవారం ఇచ్ఛాపురం తహసీల్దార్ కార్యాలయంలో ఇచ్ఛాపురం, సోంపేట సర్కిల్ పరిధిలోని పోలీసు అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా చూడాలన్నారు. సమావేశంలో ఇచ్ఛాపురం, సోంపేట సీఐలు టి.ఇమ్మాన్యుల్‌రాజు, హెచ్.మల్లేశ్వరరావు, ఇచ్ఛాపురం రూరల్, టౌన్, కవిటి, కంచిలి, సోంపేట ఎస్‌ఐలు ఎన్.లక్ష్మణ్, సత్యనారాయణ, రాము, రాజేష్, బడ్డ హైమావతి పాల్గొన్నారు.

అమరుల ఆశయాలు నెరవేర్చాలి


మాట్లాడుతున్న పోతనపల్లి కుసుమ

పలాస: మహత్తర శ్రీకాకుళం జిల్లా గిరిజన రైతాంగ పోరాటంలో అమరులైన వీరుల మార్గమే నేటి యువతరానికి మార్గదర్శకం కావాలని విప్లవ కమ్యూనిస్టు నేతలు ప్రజలకు పిలుపునిచ్చారు. పలాస మండలం బొడ్డపాడు అమరవీరుల స్మారక మందిరం వద్ద సోమవారం రాత్రి వివిధ విప్లవ గ్రూపులకు చెందిన నాయకులు, ప్రజలు, ఆ పార్టీ అభిమానులు అమరుల స్మారక సభను ఘనంగా నిర్వహించారు. అనంతరం అరుణపతాకాన్ని ఆవిష్కరించారు. సి.పి.ఐ.ఎం.ఎల్.న్యూడెమొక్రసీ నాయకురాలు పోతనపల్లి కుసుమ అధ్యక్షతన జరిగిన సభలో పార్టీ జిల్లా నాయకుడు గొరకల బాలకృష్ణ, లిబరేషన్ నాయకులు మద్దిల మల్లేశ్వరరావు, తామాడ సన్యాసిరావు, బవిరి కూర్మారావు, రాజు, అప్పయ్య, ఈశ్వరమ్మ, సుందరమ్మ, ముసలయ్య, కైలాస్, రాజారావు తదితరులు పాల్గొన్నారు.